





# మనం

MANAM

చిత్తూరు । తిరుపతి

శనివారం 6 జూన్ 2026

4 పేజీలు






## తిరుమలలో ఏఐ ఆధారిత

# భక్తుల సేవల నిర్వహణ ప్రశంసనీయం

- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్
- ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ పనితీరుపై హర్షం
- "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమంలో మొక్క నాటిన కేంద్ర మంత్రి







తిరుమల, జూన్ 05, మనం న్యూస్ :తిరుమలలో భక్తుల సేవల నిర్వహణలో కృత్రిమ మేధస్సు (ఏఐ), ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న తీరు ప్రశంసనీయమని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. శుక్రవారం ఆయన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపం లో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా, టీటీడీ ఈవో ఎం. రవిచంద్ర శ్రీవారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ, వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) ద్వారా వసతి గదుల ఆక్యుపెన్సీ వివరాలు, భక్తుల రాకపోకలు, దర్శన క్యూ లైన్లు, లడ్డూ ప్రసాదాల పంపిణీ వంటి అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం వల్ల భక్తులకు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలు అందుతున్నాయని చెప్పారు.ఈ కేంద్రం ద్వారా గదుల లభ్యత, వివిధ కంపార్ట్మెంట్లలో వేచి ఉన్న భక్తుల సంఖ్య, గంటల వారీగా తిరుమలకు చేరుకుంటున్న భక్తుల వివరాలు, లడ్డూ ప్రసాదాల పంపిణీ సమాచారం తక్షణమే అందుబాటులోకి వస్తోందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సాంకేతికతను ప్రోత్సహిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ ప్రాజెక్టుకు సహకరించిన ప్రవాస భారతీయ భక్తులకు కృతజ్ఞతలు తెలియ జేస్తూ, కేవలం 100 రోజుల లోపే ఏఐ ఆధారిత వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చిన టీటీడీ అధికారులను అభినందించారు.అంతకుముందు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమంలో పాల్గొని మొక్కను నాటారు. తిరుమలలో తన తల్లి పేరుతో మొక్క నాటడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రతి చిన్నారి తమ తల్లి పేరు మీద ఒక మొక్కను నాటి, జీవితాంతం దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ కార్యక్రమం పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం జూన్ మొదటి వారంలో తన జన్మదినం సందర్భంగా తిరుమలను సందర్శించి శ్రీవారి ఆశీస్సులు పొందడం ఆనవాయితీగా కొనసాగుతోందని చెప్పారు. దేశ సేవకు, ప్రజల సంక్షేమానికి మరింత కృషి చేసేలా శ్రీవారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం తదితర అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల కట్టడికి పకడ్బందీ చర్యలు..

- జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



మదనపల్లె, జూన్ 05, మనం న్యూస్:అ న్నమయ్య జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేసి, సామాన్య ప్రజల ప్రాణాలను రక్షించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి శుక్రవారం మదనపల్లిలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో, రవాణా, ఆర్ అండ్ బి, జాతీయ రహదారుల అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. రహదారి భద్రతపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్న ఆయన మాట్లాడుతూ.. రాత్రి వేళల్లో ప్రమాదాల నివారణకు వ్యవసాయ ట్రాక్టర్లకు తప్పనిసరిగా రేడియం రిఫ్లెక్టర్లు అమర్చాలని అధికారులను ఆదేశించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించేలా చూడటంతో పాటు, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ మాట్లాడే వారిపై, హై బీమ్ లైట్లతో ఎదురుగా వచ్చే వారి కళ్లు మిరుమిట్లు గొలిపేలా వ్యవహరించే వారిపై కొరడా ఝుళిపించాలని స్పష్టం చేశారు. అలాగే, జాతీయ రహదారుల వెంబడి ఉన్న నివాస ప్రాంతాల వద్ద ప్రమాదాలు జరగకుండా తగినంత వీధి దీపాల సదుపాయం కల్పించాలని సూచించారు. ఆర్టీసీ బస్సులు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, ప్రయాణికులు ఎక్కేందుకు, దిగేందుకు నిర్దేశించిన బస్టాండ్లలో మాత్రమే ఆపాలని, రోడ్డు ఆక్రమణలను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. రైతులు పొలాల కోసం పైప్‌లైన్ తవ్వకాల కారణంగా అనేక ప్రాంతాల్లో రహదారులు దెబ్బతిన్నాయని, వాటికి వెంటనే తగిన మరమ్మతులు చేపట్టి వాహనదారులకు ఇబ్బందులు, ప్రమాదాలు లేకుండా చూడాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. వాహనదారులు లేన్ క్రమశిక్షణ పాటించేలా చూడటంతో పాటు, రాంగ్ రూట్‌లో ప్రయాణించే వారిలో మార్పు కోసం విస్తృత అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సాంకేతికతను జోడిస్తూ ఆధునిక ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థను (అడ్వాన్స్ ట్రాఫిక్ మేనేజ్మెంట్ సిస్టం) పటిష్టంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా విద్యార్థులు, యువతలో మార్పు తీసుకురావడానికి జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో "హెల్మెట్ లేకపోతే ప్రవేశం లేదు" (నో హెల్మెట్ - నో ఎంట్రీ) అనే నిబంధనను కఠినంగా అమలు చేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

ఈ సమీక్షా సమావేశంలో జిల్లా రవాణా అధికారి డి. అశోక్ ప్రతాప్, అన్నమయ్య జిల్లా డీఆర్‌బీఈఓ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. అరవింద దేవి, జాతీయ రహదారుల డీఈఈలు పి. మధుసూదన (మదనపల్లె), సుజాత (చిత్తూరు), సి. నాగరాజ (రాయచోటి), మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు దినేశ్ చంద్ర,అజయ్ కుమార్, డీసీఆర్బీ సీఐ ఏ. ఆదినారాయణ రెడ్డి, డీటీఆర్బీ ఎస్ఐ డి. రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత



తిరుపతి, జూన్ 5 : పర్యావరణం ప్రతి ఒక్కరి బాధ్యత... ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.లెనిన్ బాబు.శుక్రవారం కోర్టు సముదాయంలో ఉన్న ప్రత్యేక సబ్ జైల్ లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ముఖ్య అతిథిగా జడ్జి పాల్గొనడం జరిగినది. ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఒక చెట్టును నాటడం అలవాటుగా చేసుకోవాలని, దాని ద్వారా మన ఆరోగ్యంగా ఉంటామని అన్నారు. పర్యావరణం బాగుంటుందని, పర్యావరణం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మంచి అలవాటుగా అలవర్చుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరు చెట్లు నాటడం తో పాటు, ఆ మొక్కలని ప్రతిరోజు నీరు పోసి పెద్దవి అయ్యేవిధంగా చూసుకోవాలని తెలియజేశారు. వాహనాల నుండి వచ్చే వాయువులను కూడా ఇది నివారిస్తుందని తెలియజేశారు. సబ్ జైల్లో మొక్కలను నాటి, ఖైదీలతో వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సబ్ జైల్ లోపల సందర్శించారు. ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ పాల్గొన్నారు.

## తిరుపతిగంగమాంబ దేవస్థానంకు భూదాన కార్యక్రమం



కుప్పం జూన్ 5మనం న్యూస్:కుప్పం శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ దేవస్థానం "భూ దా న ము "న కు 1 0 , 1 0 0 / - రూపాయలతో 1.3 చదరపు అడుగులు "భూదా నం" ఇచ్చినవారు కె.హంసమ్మ జి కృష్ణమూర్తి గారి కుమారులు దయానిది, ఉదయ్ లక్ష్మీపురం కుప్పం వారు చెల్లించినారు. వారికి వారి కుటుంబ సభ్యులకు తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటూతిరుపతి గంగమ్మ చైర్మన్ బి ఎం కెరవి చంద్రబాబు మరియు ట్రస్ట్ బోర్డు సభ్యులుతదితరులు పాల్గొన్నారు

# ప్రయోగాత్మకంగా "శ్రీవారి వైద్య సేవ" ప్రారంభం

- టీటీడీ ఆసుపత్రుల్లో స్వచ్ఛంద వైద్య సేవలకు అవకాశం
- ఐటీ అప్లికేషన్‌ను ప్రారంభించిన టీటీడీ ఈవో ఎం. రవిచంద్ర



తిరుమల,జూన్ 05,మనం న్యూస్:రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు టీటీడీ ఆసుపత్రుల్లో "శ్రీవారి వైద్య సేవ" కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా టీటీడీ ఈవో ఎం. రవిచంద్ర ప్రత్యేకంగా రూపొందించిన ఐటీ అప్లికేషన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వైద్య నిపుణుల సేవలను శ్రీవారి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.ప్రయోగాత్మక దశలో కార్యక్రమాన్ని అమలు చేసి, పాల్గొనే వైద్య నిపుణుల నుంచి అభిప్రాయాలు సేకరించి మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు విద్య, వైద్యం, ఐటీ తదితర రంగాల్లో సేవా భావంతో ముందుకు వచ్చే నిపుణులకు టీటీడీ వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు.టీటీడీ ఆసుపత్రులు, విద్యాసంస్థల్లో సేవలందించేందుకు వచ్చే నిపుణులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన వసతి, భోజన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృత స్థాయిలో అమలు చేసి ఎక్కువ మంది నిపుణుల సేవలను వినియోగించుకునేలా చర్యలు చేపడతామని వివరించారు.ప్రత్యేకంగా రూపొందించిన ఐటీ అప్లికేషన్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు, వైద్య నిపుణులు తమకు అనుకూలమైన తేదీల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని సేవలందించవచ్చు.సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణులకు మూడు రోజుల పాటు, ఎంబీబీఎస్ వైద్యులకు ఏడు రోజుల పాటు స్వచ్ఛంద సేవ చేసే అవకాశం కల్పించనున్నారు. వీరికి తిరుమల, తిరుపతిలో వసతి, భోజన సౌకర్యాలు టీటీడీ ద్వారా అందించబడతాయి.అశ్విని ఆసుపత్రి, స్విమ్స్, బర్డ్ ఆసుపత్రి, ఆయుర్వేద ఆసుపత్రి, శ్రీ పద్మావతి చిన్నపిల్లల ఆసుపత్రి, ఎస్వీ గోశాల తదితర టీటీడీ అనుబంధ సంస్థల్లో వైద్య నిపుణులు తమ సేవలను అందించనున్నారు. హిందూ మతానికి చెందిన ఆసక్తిగల వైద్య నిపుణులు ఆన్‌లైన్ ద్వారా టీటీడీ వెబ్ సైట్ లో తమ స్లాట్‌ను బుక్ చేసుకుని ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా హైదరాబాద్ ఐ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ ప్రొఫెసర్ వెంకటాచలం, సికింద్రాబాద్ లోని కృష్ణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అకాడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్‌ఎ శాస్త్రి, వైజాగ్ ఆంధ్ర మెడికల్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్, బెంగళూరు ఈఎస్ఐ హాస్పిటల్ ఆర్థో హెచ్‌ఓడి డాక్టర్ పురుషోత్తం ఈవోతో వర్చువల్‌గా మాట్లాడి, టీటీడీ ఆసుపత్రుల్లో సేవలందించే అవకాశం కల్పించడం శ్రీవారి అనుగ్రహంగా భావిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, జేఈఓలు (విద్య, వైద్యం) డాక్టర్ శరత్, వీరబ్రహ్మం, సీవీఎస్ఓ మురళీకృష్ణ, వివిధ ఆసుపత్రుల డైరెక్టర్లు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## త్రిముఖం చిత్ర పూజా కార్యక్రమంలో పాల్గొన్న జనసేన చేనేత ప్రధాన కార్యదర్శి అడపా సురేంద్ర



మదనపల్లె, జూన్ 5,మనం న్యూస్:త్రిముఖం మూవీ డైరెక్టర్ శివకుమార్, యాక్టర్ జగదీష్ గారి ఆహ్వానం మేరకు త్రిముఖం మూవీ పూజా కార్యక్రమంలో పాల్గొన్నజనసేన పార్టీ రాష్ట్ర చేనేత ప్రధాన కార్యదర్శి అడపా సురేంద్ర అడపా సురేంద్ర మాట్లాడుతూ సి ఎస్ ఆర్ ప్రొడక్షన్లో,రుచ్చిక ప్రెజెన్సీస్ త్రిముఖం చిత్రం డైరెక్టర్ శివ నటుడు జగదీష్ కి మరియు చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సినిమా కి మంచి పేరు రావాలని త్రిముఖం మూవీ నిర్మాత గారైన ఉమేష్ కి ఈ సినిమాలో యాక్టింగ్ చేస్తున్న ఆర్టిస్టులు అందరికీ మంచి పేరు రావాలని ఈ సినిమా గొప్పగా ఆడాలని మనస్ఫూర్తిగా వారికి మదనపల్లి ప్రజల ఆశీస్సులు ఉంటాయని తెలియజేశారు. మదనపల్లి పరిసర ప్రాంతాల్లో ఉన్న సినీ యాక్టర్స్ కి కొత్త వాళ్లకి డైరెక్టర్ శివకుమార్ ఒక మంచి అవకాశం కల్పించారు ఎవరైతే యాక్టింగ్ మీద ఇంట్రెస్ట్ ఉన్నవాళ్లు ఈ చిత్రంలో యాక్టింగ్ చేసేకి అవకాశం కల్పించారు కనుక ఎవరైనా ఈ మూవీలో నటించాలనుకుంటే డైరెక్టర్ శివకుమార్ కి మరియు నటుడు జగదీష్ కి కలిసి మీరు కూడా యాక్టింగ్ చేయొచ్చు ఈ చక్కటి అవకాశాన్ని మనవాళ్ళందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరుకుంటున్నాను.

## పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు.



పీలేరు జూన్ 5 మనం న్యూస్: పర్యావరణాన్ని రక్షిద్దాం కాలుష్యాన్ని నిర్మూలిద్దాం అనే నినాదంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రేగళ్లు ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా డా.రాధ మాధవి, డా. సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శుక్రవారం వాసవి క్లబ్ సభ్యులు పీహెచ్ సి పరిదిలో చెట్లు నాటడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రాధా మాధవి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటం మనందరి బాధ్యతని, ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటలని, ప్రకృతి పరిరక్షణ కాపాడాలని, మన ఆరోగ్యం మన చేతుల్లో ఉందని తెలియ చేసారు. ఈ కార్యక్రమం లో హెచ్‌ఈ కృష్ణమ్మ పర్యవేక్షకులు ఏఎన్ఎంలు, ఆశాలు వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ వి వైద్య కళాశాలలో

## ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం




తిరుపతి,జూన్ 05,మనం న్యూస్: ఎస్ వి వైద్య కళాశాల ప్రాంగణంలో అదనపు వైద్య విద్య సంచాలకులు మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ జి రవి ప్రభు ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం వైద్య కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు.ముఖ్యమంత్రి పిలుపుతో జిల్లావ్యాప్తంగా పర్యావరణ ఉద్యమం పెద్ద ఎత్తున మొక్కలు నాటిన వైద్య విద్యార్థులు, మరియు వైద్య సిబ్బంది.ఈ సంవత్సరం థీమ్: "భూ పునరుద్ధరణ, ఎడారీకరణ మరియు కరవును తట్టుకునే శక్తిని పెంపొందించడం"ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య కళాశాల కార్యాలయ ఆవరణలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించబడింది.

## ప్రకృతిని కాపాడితేనే భవిష్యత్తు సురక్షితం

- ప్రకృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం



తిరుపతి, జూన్ 05, మనం న్యూస్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవం లో భాగంగా పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్యాన్ని కాపాడే అంశం పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎన్ టి ఆర్ జిల్లా మూలపాడు నుండి రాష్ట్ర వ్యాప్తంగా పర్యావరణ దినోత్సవం కార్యక్రమంలో వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని తిరుపతి కాపీలతీర్థం సమీపం లోని నగరవనంలో అధికారులు, విద్యార్థులు, వాకర్స్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. ఈ కార్యక్రమంలో డి ఎఫ్ ఓ పవన్ కుమార్, ఎఫ్ ఆర్ ఓ లు సుదర్శన్ రెడ్డి, మాధవి, దాదాపు 100 మంది విద్యార్థులు, ఏపీ గ్రీన్ క్రాప్స్, గోపాల్స్ వంటి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రకృతి ప్రేమికులు మరియు అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథులు, విద్యార్థులు, వాకర్స్ పర్యావరణ పరిరక్షణ పై అవగాహన ర్యాలీ నిర్వహించడంతో పాటు విద్యార్థులు, సిబ్బంది, తదితరులు.

## విద్యుత్ బిల్లుల వసూళ్ల కేంద్రం ప్రారంభం!



పూతలపట్టు జూన్ 5 మనం న్యూస్:పూ తలపట్టు మండల కేంద్రమైన పూతలపట్టు లో విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రం ను ఏఈ నరసింహులు ప్రారంభించారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు గణపతి పూజలు చేశారు. గత కొన్ని ఏళ్లుగా వసూలు కేంద్రం లేక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలోని చావిడి వద్ద ఏర్పాటుచేసిన నూతన భవనం ను వసూలు కేంద్రంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ పూతలపట్టు విద్యుత్ వినియోగదారులకు శాశ్వత భవనం ఉందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐ లు రమేష్ హేమంత్ రెడ్డి పలువురు లైన్మెన్లు జేఎల్ఎం లు పాల్గొన్నారు.

## సంగరాజు భాస్కర రాజుకు జాతీయ వాగ్దేవి పురస్కారం

మనం న్యూస్ శ్రీకాళహస్తి: ాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో గంగా సదన్, శ్రీకాళహస్తిలో నిర్వహించిన ప్రత్యేక సాహిత్య, భాషా సాంస్కృతిక కార్యక్రమంలో ప్రముఖ చదువుల డాక్టర్, భాషా శాస్త్రవేత సంగరాజు భాస్కర రాజు కి "జాతీయ వాగ్దేవి పురస్కారం" ప్రదానం చేశారు.తెలుగు భాషాభివృద్ధి, భాషా పరిశోధన, విద్యా రంగాలలో ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు, విద్యావేత్తలు, భాషా పరిశోధకులు పాల్గొని శ్రీ సంగరాజు భాస్కర రాజును అభినందించారు.ఈ సందర్భంగా మాట్లాడిన వక్తలు, తెలుగు భాష పరిరక్షణ మరియు వ్యాప్తికి ఆయన చేస్తున్న కృషి యువతకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. పురస్కారం అందుకున్న సంగరాజు భాస్కర రాజు ఈ గౌరవానికి జాతీయ తెలుగు సారస్వత పరిషత్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా తెలుగు భాషా సేవలో మరింత కృషి చేస్తానని తెలిపారు.

## పూతలపట్టు టిడిపి కార్యాలయంలో బిఎల్ఏ లకు వర్క్ షాప్



పూతలపట్టు జూన్ 5 మనం న్యూస్: పూతలపట్టు తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు శుక్రవారం సర్ బి ఎల్ ఏలకు వర్క్ షాప్ జరిగింది ఈ కార్యక్రమానికి పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు సర్ పై తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో యూనిట్,బూత్ కన్వీనర్లు, బి.ఎల్.ఏ లకు నిర్వహించిన వర్క్ షాప్ కి హాజరైన ఎమ్మెల్యే మురళి మోహన్ దిశా నిర్దేశం చేసిన వర్క్ షాప్ లో పాల్గొన్నారు కార్యక్రమంలో పూతలపట్టు,ఐరాల మండల అధ్యక్షులు దొరబాబు చౌదరి, హరిబాబు నాయుడు,క్లస్టర్ ఇంచార్జీ చంద్రబాబు నాయుడు గొడుగు చింత దాము పేట అగ్రహారం అర్జున్ తదితరులు. పాల్గొన్నారు

## కుప్పం ఎంపీ డిఓ గా రాజేంద్రప్రసాద్



కుప్పం జూన్5మనం న్యూస్:కు ప్పం మండల అభివృద్ధి అధికారిగా రాజేంద్ర ప్రసాద్ బాధ్యతలుస్వీకరించారు. గతంలో మండల అభివృద్ధి అధికారి గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు అనారోగ్య కారణాల చేత మెడికల్లీవ్ పెట్టడంతో ఆయన స్థానంలో రాజేంద్ర ప్రసాద్నియమితులయ్యారు. కడప జిల్లా రాజంపేట పీఆర్ఎస్ఐడివిజన్ ఏవోగా పనిచేస్తున్న రాజేంద్రప్రసాద్ పదోన్నతిపైకుప్పం మండల అభివృద్ధి అధికారిగా నియమితులయ్యారు.

## అమ్మ పేరుతో ఒక మొక్కభవిష్యత్ తరాలకు ఒక గొప్ప బహుమతి

- కుప్పం భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ మరియురెస్కో డైరెక్టర్ తులసి నాథ్



కుప్పం జూన్5 మనం న్యూస్:ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇచ్చిన "అమ్మ పేరుతో ఒక మొక్క" పిలుపు మేరకు కుప్పం నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ కార్యాలయం ముందర అమ్మ పేరుతో ఒక మొక్క నాటి, దానిని సంరక్షిస్తూ పర్యావరణపరిరక్షణలోభాగస్వాము లమవుదాంఒక మొక్క నేటి అవసరంఒక చెట్టు రేపటి భరోసాఅని భారతీయ జనతా పార్టీకుప్పం నియోజకవర్గం ఇంచార్జి ఎన్ ఎస్ తులసి నాథ్ రెస్కో డైరెక్టర్ తెలిపారు.

## ప్లాస్టిక్ రహిత తిరుపతి స్థాపనకు అందరూ సహకరించాలి.

- కమిషనర్ (ఎఫ్.ఏ.సి.)శారదా దేవి



ప్లాస్టిక్ రహిత తిరుపతి స్థాపనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి పిలుపునిచ్చారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా శుక్రవారం ఉదయం నగరంలోని జీవకోన నందు పారిశుద్ధ్య పనుల నిర్వహణ, రైతు బజార్ నందు పారిశుద్ధ్య పనులతో పాటు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం తగ్గించి పర్యావరణ హితమైనవి వినియోగించాలని పిలుపునిచ్చారు. నగరంలో ఎక్కడైనా సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా నగరంలోని కాలువలు, నాలాలు శుభ్రం చేస్తున్నామని తెలిపారు. ఏ కాలువలో చూసినా ప్లాస్టిక్ కవర్లలో కట్టి వేసిన చెత్తచెదారం వస్తోందని తెలిపారు. కాలువల్లో చెత్త వేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పారిశుద్ధ్య సిబ్బంది అన్ని ప్రాంతాల్లోని కాలువల్లో మట్టి, చెత్త తొలగించాలని తెలిపారు. రుతుపవనాల వలన కురిసే వర్షాలతో రోడ్లపై నీరు నిలవకుండా సజావుగా వెళ్లేలా తగుచర్యలు చెపట్టాలని సిబ్బందికి సూచించారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.లు రమణ, మహేష్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, పారిశుద్ధ్య విభాగపు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబుకి రాష్ట్రాన్ని పాలించే అర్హత లేదు!

- ఆటకెక్కిన ఆడబిడ్డనిధి - తల్లికి వందనంలో కోతలు--!
- ప్రజా సమస్యలపై వైసిపి ఉక్కు పాదం-!
- సమన్వయకర్త డాక్టర్ సునీల్ కుమార్



పూతలపట్టు జూన్ 5 మనం న్యూస్: రాష్ట్రాన్ని పాలించే అర్హత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు లేదని పూతలపట్టు నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త డాక్టర్ సునీల్ కుమార్ పేర్కొన్నారు వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పూతలపట్టు అంబేద్కర్ సర్కిల్ వద్ద వైసీపీ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నినాదాలు చేశారు వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమం శాంతియుతంగా మండల పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా సమన్వయకర్త సునీల్ కుమార్ మాట్లాడుతూ నేను ఆర్థిక సంస్కర్తను సంపద ఎలా సృష్టించాలో నాకు తెలుసు అని గత ఎన్నికల్లో ప్రచారం చేసిన చంద్రబాబు నాయుడుసూపర్ సిక్స్ పేరిట అనేక హామీలు ఇచ్చి నేడు చేతులెత్తిన చంద్రబాబు రాష్ట్ర పాలించే అర్హత లేదని ఆయన అన్నారు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు చేయడంలో విఫలమైందని ఆయన అన్నారు పూతలపట్టు ఎమ్మెల్యే అధికారం చేపట్టి రెండు సంవత్సరాల నడుస్తున్న ఇంతవరకు పూతల పట్టు నియోజకవర్గానికి ఏ పని సక్రమంగా చేయలేదని ఆయన విమర్శించారు అనంతరంవైసిపి రాష్ట్ర సీనియర్ నాయకులు తలపల్లి బాబు రెడ్డి మాట్లాడుతూ రెండు సంవత్సరాలకాలంగా ఆంధ్రప్రదేశ్ లో విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించిన చంద్రబాబు నాయుడు నారా లోకేష్ అని ఆయన పేర్కొన్నారు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కంటే ఎక్కువ పథకాలు ఇస్తానని హామీ ఇచ్చి గెలిచాక అన్నింటికీ మంగళం పాడారని ఆయన ఎద్దేవా చేశారు తల్లికి వందనం లో కోతలు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు అటకెక్కిందన్నారు విద్యారంగం నాశనం అవ్వడానికి ముఖ్య కారకులు విద్యాశాఖ మంత్రినారా లోకేష్ కారణమని ఆయన తెలిపారు పేద విద్యార్థులపై ఎందుకింత కక్ష కట్టారో అర్థం కాలేదని ఆయన అన్నారు రాష్ట్రంలో ఒక్క కొత్త పెన్షన్ కూడా ఇంతవరకు ఇవ్వలేని దుర్మార్గమైన పరిస్థితి రాష్ట్రంలో ఏర్పడిందని అన్నారు అనంతరం మండల వైసీపీ పార్టీ కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ నాడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందరికీ సంక్షేమ పథకాలు అందించారని నేడు కూటమి ప్రభుత్వం తమ కార్యకర్తలకు పథకాలు ఇస్తున్నారని ఆయన పేర్కొన్నారు ఒకటి రెండు సంక్షేమ పథకాలకు తప్ప మేనిఫెస్టోలో ఉన్నఒక్క పథకం కూడా అమలు చేయలేదని ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారులకు వచ్చిన తర్వాత వెన్నుపోటు పొడిచే విధానాన్ని ప్రతి గడపగడపకు తీసుకెళ్లి ప్రజలకు అందరికీ అర్థమయ్యేలా వైసిపి నాయకులు కార్యకర్తలు ప్రజలకు తెలియజేయాలని ఆయన అన్నారు ఇంతవరకు పక్క ఇల్లు గాని కొత్త పెన్షన్ గాని ఏ ఒక్కటి ఇవ్వకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు కూటమి ప్రభుత్వం మాయమాటలకు ప్రజలు మంగళం పాడుతారన్నారు చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు పడుతున్న కష్టాన్ని కూడా ప్రత్యక్షంగా చూసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏ ఒక్క రైతుకు గిట్టుబాటు ధర కల్పించకపోవడం చాలా దురదృష్టకరమన్నారుప్రతి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కంట్లో నీరు వచ్చి నేటికీ రెండేళ్ళు ఈ రాష్ట్ర ప్రజలు ప్రజా పరిపాలనను వదిలి రాక్షసుల రాజ్యాన్ని తెచ్చుకుని నేటికి రెండేళ్లు!పాలిచ్చే గేదెను కాదని ఎగిరి తన్నే దూడను తెచ్చుకున్నారుఈరోజు జగనే ఉండుంటే బాగుండేది అనుకుంటున్నారుఈ కన్నీటికి సమాధానం ప్రజలు 2029 లో కచ్చితంగా చెప్తారు కార్యక్రమంలో అమర్నాథ్ రెడ్డి రామ్మూర్తి నవీన్ రెడ్డి సుధాకర్ రెడ్డి గుణశేఖర్ రెడ్డి నాయకులు కార్యకర్తలు వారి వెంట తెచ్చుకున్న వెన్నుపోటుకు రెండేళ్లు కాగితాలనుచింపి కింద పారివేసి గోవిందా గోవిందా అంటూ నినాదాలు చేసుకుంటూ వెళ్లిపోవడం జరిగింది

# ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక దైవచింతనను పెంపొందించుకోవాలి

- ఎమ్మెల్యే పులివర్తి నాని
- కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో అభివృద్ధి పనుల ప్రారంభించిన ఎమ్మెల్యే పులివర్తి నాని.



రామచంద్రపురం : సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక దైవచింతన, భక్తి మార్గాలను పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే కొలుమర్తి వెంకట మణి ప్రసాద్ ( నాని) అన్నారు. మండలంలోని రాయల చెరువు కట్ట కింద ఉన్న శ్రీ కామాక్షి సమేత కోటిలింగేశ్వర స్వామి ఆలయం వద్ద దాతల సహకారంతో చేసిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు. శుక్రవారం పివిపురం పంచాయతీ, రాయల చెరువు కట్ట సమీపంలో శ్రీ జలకంఠేశ్వర స్వామి, శ్రీ కామాక్షి సమేత కోటిలింగేశ్వర స్వామి ఆలయ పరిసరాలలో నూతనంగా నిర్మించిన దుకాణాల సముదాయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే పులివర్తి నానికి ఆలయ నిర్వాహకులు తంజావూరు మణి,జయభారతి దంపతులు, వేద పండితులు మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ జలకంఠేశ్వర స్వామి, శ్రీ కామాక్షి సమేత కోటిలింగేశ్వర స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. అర్చకులు ఎమ్మెల్యే పులివర్తి నానిని శాలువలతో సత్కరించి వేద ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయల చెరువు పరిసర ప్రాంతం ఆధ్యాత్మికత, పర్యాటకంగా అభివృద్ధికి అనుకూలంగా ఉందని పేర్కొన్నారు. రూ.రెండు కోట్ల రూపాయలతో ఆలయ ప్రాంగణంలో దాతలు సహకారంతో అభివృద్ధి చేయడం అభినందనీయమని దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చేకూరు జనార్ధన్ చౌదరి, ఆరి లీలా మోహన్ నాయుడు, నీలకంఠ చౌదరి, కేశవులనాయుడు, విజయ్ కుమార్, ఆర్ గిరిబాబు, సుగుణమ్మ, లతా సుబ్రహ్మణ్యం రెడ్డి, బాదురు ధనుంజయులు, మల్లిరెడ్డి జయరామయ్య, కుప్పా త్యాగరాజులు, రాజేష్ రెడ్డి, ఈశ్వర్ రాయల్, దాతలు భాస్కర్ నాయుడు, దేవరాజు నాయుడు, మరియు స్థానికులు దేశి రెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, శేఖర్ నాయుడు, సురేంద్ర నాయుడు, మహేష్ నాయుడు, మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మొక్కలను నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

- బి సి ఎన్ విద్యా సంస్థల | చైర్మన్ డా. బి.సి నాగరాజ్



కుప్పం జూన్5 మనం న్యూస్:కు ప్పం ఇంజనీరింగ్ కళాశాల ఎన్ ఎస్ ఎస్ విభాగం ఆధ్వర్యంలో జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి బి సి ఎన్ విద్యా సంస్థల అధినేత డా. బి.సి. నాగరాజ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి కళాశాల ఆవరణలో మొక్కలునాటి పర్యావరణ పరిరక్షణకు తన వంతు సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా డా. బి.సి. నాగరాజ్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరంజూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. నేటిపారిశ్రామికీకరణ యుగంలో పర్యావరణ పరిరక్షణ అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా చెట్లను విచక్షణారహితంగానరికివేయడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతిన్నదని, దాని ప్రభావంగా ప్రపంచవ్యాప్తంగా వాతావరణ వ్యవస్థలో వేగవంతమైనమార్పులుచోటుచేసు కుంటున్నాయని వివరించారు.ప్రపంచం ప్రస్తుతం క్షీణిస్తున్న పర్యావరణ సమతుల్యత, పెరుగుతున్న కాలుష్య సమస్యలతో పోరాడుతోందని పేర్కొన్న ఆయన, ఈసంక్షోభానికి శాశ్వత పరిష్కారంపచ్చదనాన్నిపెంపొందించడమేనని అన్నారు. చెట్ల సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందినప్పుడేపర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, అందుకోసం సమర్థవంతమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రకృతినిప్రేమిస్తూ, పరిరక్షిస్తూ, ప్రకృతితో సామరస్యంగా జీవించినప్పుడే మానవాళిమనుగడసాధ్యమవుతుందని ఆయన అన్నారు. స్వార్థపూరితఅవసరాల కోసం మనిషి ప్రకృతిని నిర్లక్ష్యం చేయడం వల్ల అకాల వర్షాలు, కరువు, వరదలు, జీవ వైవిధ్యం క్షీణించడం, భూతాపం పెరగడం,సముద్ర మట్టాలు పెరగడం, రుతువుల్లో అసాధారణ మార్పులు వంటి అనేక ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు.ఇలాంటి పరిస్థితులు కొనసాగితే మానవాళి వినాశనం దిశగా పయనించే ప్రమాదం ఉందని హెచ్చరించిన ఆయన, ప్రభుత్వ చర్యలకుతోడుగా విద్యార్థులు, యువత కూడా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవస్ఫూర్తిని ఒక్క రోజుకే పరిమితం చేయకుండా, ఏడాది పొడవునా పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా. ఎస్. బాస్కరన్, ఆర్ & డీ డైరెక్టర్ డా. జి.ఎన్.కోదండరామయ్య, లైబ్రరీ విభాగాధిపతి డా. సి జి శరవణ, హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతి జె. మాధవన్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్గంగాధరన్, ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ డా. అరుణ్ కుమార్, పి ఆర్ ఓ ప్రవీణ్ కుమార్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు మరియు ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# చంద్రబాబు హామీలకు నిప్పంటించిన వైఎస్సార్సీపీ

- చంద్రబాబు వెన్నుపోటుకు
- రెండేళ్లు' అంటూ భారీ నిరసనలు
- సూపర్ సిక్స్ హామీల దహనం..

కూటమి ప్రభుత్వంపై నేతల మండిపాటు



చంద్రగిరి జూన్ 5 మనం న్యూస్: ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం, రెండేళ్లు గడిచినా వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపిస్తూ చంద్రగిరి నియోజకవర్గం వ్యాప్తంగా వైఎస్సార్సీపీ నేతలు, కార్యకర్తలు శుక్రవారం భారీ నిరసనలు నిర్వహించారు. ''చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు'' పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమంలో సూపర్ సిక్స్ హామీల పత్రాలు, టీడీపీ మేనిఫెస్టో ప్రతులను దహనం చేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు.మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నాయకత్వంలో, రాష్ట్ర వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి సూచనలతో నియోజకవర్గంలోనిచంద్రగిరి,పాకాల,తిరుపతి రూరల్, రామచంద్రాపురం, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.ప్రతి మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ''చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు'' అని రాసిన ప్లకార్డులు, బ్యానర్లు చేతబట్టి ర్యాలీలు నిర్వహించారు. అనంతరం సూపర్ సిక్స్ హామీల బుక్‌లెట్లు, టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో ప్రతులు, ప్రచార పత్రాలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో మహిళలు, రైతులు, యువత, విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్సీపీ నేతలు విమర్శించారు.ప్రజల ఆశలను ఆసరాగా చేసుకుని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ఇప్పుడు హామీల అమలుపై మౌనం పాటిస్తూ ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాల అమలుపై రెండేళ్లుగా స్పష్టత లేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన వారికి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఈ సందర్భంగా ''సూపర్ సిక్స్.. అట్టర్ ఫ్లాప్'', ''చెట్టుమీద కొంగ.. చంద్రబాబు దొంగ'', ''అబద్ధాల హామీలతో వచ్చిన ప్రభుత్వానికి ప్రజలే తీర్పు చెబుతారు'' అంటూ నినాదాలు చేశారు. మండల కేంద్రాల్లో జరిగిన నిరసన కార్యక్రమాలకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేశారు.చంద్రగిరి మండలంలో వైఎస్సార్ సిపి మండల కార్యాలయం నుంచి ర్యాలీ బయలుదేరి టవర్ క్లాక్ వద్ద నిరసన తెలిపి చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని హామీ ప్రతులను తగల పెట్టారు.ఈ కార్యక్రమాల్లో యంపిపి హేమేంద్రకుమార్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు కొటాలచంద్రశేఖర్ రెడ్డి,బొజ్జా వెంకటరత్నం,బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి,చెంగల్రాయులు, పిసిఆర్,వంటి శివశంకర్ రెడ్డి, మురగయ్య,చెంగల్ రెడ్డి, కోటిరెడ్డి, పాకాలశరణ్,నాగేశ్వరరావు,అజయ్‌కుమార్,సూరి,మునిక్రిష్ణ, నియోజకవర్గంలోని పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనలు కొనసాగించారు.

## కొత్తగా అమరుస్తున్న కరెంటు పోల్స్ సరే... నిబంధనలు మరిచారే....?



పిచ్చాటూరు జూన్ 5 మనం న్యూస్ : మండలంలోని అడవికోడిఎంబేడు, కారూరు , అప్పలరాజు కండ్రిగ, పులిగుండ్రం, హనుమంతపురం తదితర గ్రామాల పరిధిలో నిరంతర విద్యుత్ అందించాలన్న కారణాలతో పాటు గ్రామాల్లోని త్రాగునీటి కి అందిస్తున్న విద్యుత్ నిరాకటంగా కొనసాగించడం కోసం పాత విద్యుత్ పోల్స్ ను తొలగించి కొత్త పోల్స్ అమరుస్తున్నారు. అయితే ఈ పనులను దక్కించుకున్న గుత్తేదారు (కాంట్రాక్టర్) ఆడిందే ఆటగా పాడింది పాటగా తన ఇష్టారాజ్యంగా గ్రామస్తుల మాటలకు విలువ లేకుండా వ్యవహరించడం విడ్డూరంగా మారింది. విద్యుత్ స్తంభాలు వేసే ముందు విద్యుత్ వినియోగదారులను లను సైతం లెక్కచేయకుండా వీధుల్లో ఉన్న పైపులైను ధ్వంసం చేస్తూ విద్యుత్ స్తంభాలు నాటేస్తున్నారు. కొంతమంది బాధితులు ప్రశ్నిస్తే సమాధానాలు దాటవేస్తున్నారు, డబ్బులు ఇస్తే సందులకు, బొందులకు బాత్రూంలో వద్దకు పోల్స్ వేసి విద్యుత్ తీగలను అమరుస్తున్నా రూ పాత పోల్స్ లో ఉన్న గృహ విద్యుత్ కనెక్షన్లను తొలగించి కొత్త పోల్స్ కు అమర్చాలంటే వంద రూపాయలు నుంచి 300 రూపాయలు దాకా వినియోగదారుల నుండి వసూలు చేసుకుంటున్నాడు. ఇదేంటని విద్యుత్ అధికారులను ప్రశ్నిస్తే అలా చేయకూడదు ఆధారాలు ఉంటే ఇవ్వండి అతనిపై చర్యలు తీసుకుంటానని కాకమ్మ కబుర్లు చెప్పి తప్పించుకుంటున్నాడు. కరెంటు పోల్స్ కి పోల్స్ కి మధ్య కూడా దూరం చాలా తక్కువగా ఉండడం విడ్డూరంగా ఉంది. ఇదేంటని ఆరా తీస్తే పోలికి ఇంత అని కాంట్రాక్టర్కు ట్రాన్స్కో వారు చెల్లిస్తున్నారు. దీన్ని అదునుగా తీసుకొని పోల్స్ లెక్కగడుతున్నాడు. దీంతో ప్రజాధనం వృధా అవుతుందని గ్రామాల్లో ప్రజలు సైతం వాపోతున్నారు. ట్రాన్స్కో అధికారులు కమిషన్లకు కక్కుర్తి పడకుండా ఉంటే ఇలా జరిగేది కాదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాంట్రాక్టర్ పై దృష్టి సారించి ప్రజాధనం వృధా కాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వినియోగదారులు, గ్రామస్తులు వారికి ఏర్పడిన అసౌకర్యాలను వివరించాలని కాంట్రాక్టర్ ఫోన్ చేస్తే ఎంతకు తీయడు, ఒకవేళ తీసిన నేను పనిలో ఉన్నాను పెట్టేయండి అని పెట్టేస్తాడు. దీనిపైన సంబంధిత అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సంబంధిత గ్రామస్తులు వాపోతున్నారు.

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత...! ఎంపీడీవో దివాకర్

- చెట్లు ప్రగతికి మెట్లు...!డైరెక్టర్ మధు
- చెట్లు వైవిధ్య మనుగడలకు మూలాధారం...! ప్రధాన కార్యదర్శి మహేష్ నాయుడు




చిన్నగొట్టిగల్లు (ఎర్రావారి పాలెం) జూన్ 5 మనం న్యూస్:పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మన అందరి బాధ్యతని ఎంపీడీవో దివాకర్ అన్నారు. శుక్రవారం ఎర్రావారిపాలెం మండల ఎంపీడీవో దివాకర్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ మధు మాట్లాడుతూ చెట్లును నాటడం వల్ల వర్షాలు మెండుగా కురుస్తాయన్నారు.పర్యావరణ సమతుల్యతను కాపాడడానికి ప్రతి ఒక్కరూ ఒక చెట్టును నాటాలన్నారు. చెట్లే ప్రగతికి మెట్లని అలాంటి చెట్లును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలుగు దేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మహేష్ నాయుడు మాట్లాడుతూ జీవవైవిధ్య మనుగడలకు చెట్లే మూలాధారమన్నారు. పచ్చని చెట్లన్ని సర్వ మానవాళికి పరోపకారం చేసే నేస్తాలని అన్నారు.మండల అధ్యక్షుడు దేశిరెడ్డి రఘు నాధ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక చెట్టును నాటి పర్యావరణ సమతుల్యతను కాపాడాలని కోరారు.అనంతరం మొక్కలను నాటి నీళ్లు పోశారు


## తుడా ప్లానింగ్ విభాగం అధికారులతో తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి సమీక్షా సమావేశం



తిరుపతి టౌన్, జూన్ 05, మనం న్యూస్:తుడా కార్యాలయంలో తుడా చైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా|| డాలర్స్ దివాకర్ రెడ్డి ప్లానింగ్ డిపార్ట్మెంట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తుడా పరిధిలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన మరియు భవిష్యత్ ప్రణాళికల అమలుపై చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి అధికారులతో సమగ్రంగా చర్చించారు. ప్లానింగ్ విభాగంలో లేఅవుట్ అప్రూవల్స్, భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి పెండింగ్లో ఉన్న దరఖాస్తులను నిబంధనల ప్రకారం వీలైనంత త్వరగా పరిష్కరించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని చైర్మన్ సిబ్బందిని ఆదేశించారు.తిరుపతి మరియు పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా మాస్టర్ ప్లాన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని దిశా నిర్దేశం చేశారు.సుందరీకరణ మరియు ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కోసం ప్లానింగ్ డిపార్ట్మెంట్ మరింత చురుగ్గా పనిచేయాలని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి తెలిపారు.ఈ సమీక్షా సమావేశంలో తుడా సెక్రటరీ డా యన్ వి శ్రీకాంత్ బాబుతో పాటు, సిపిఒ దేవికుమారి, ఏపీఓ లు, జెపిఓలు,ప్లానింగ్ డిపార్ట్మెంట్ అధికారులు, మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నగొట్టిగల్లుకు భాను ప్రసాద్, ఎర్రావారిపాలెంకు శ్రీదేవి తహసీల్దార్లుగా భాద్యతలు

- రెవిన్యూ సమస్యలను పరిష్కరిస్తామంటూ వెల్లడి

చిన్నగొట్టిగల్లు జూన్ 4 మనం న్యూస్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జారీ చేయబడిన తాసిల్దార్ల బదిలీల ప్రక్రియలో చిన్నగొట్టిగల్లు మండలానికి కే.భాను ప్రసాద్, అలాగే ఎర్రావారి పాలెం మండలానికి సి.శ్రీదేవి లు శుక్రవారం నూతన తాసిల్దారులుగా బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకున్న రెవిన్యూ సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌరసరఫరాల నిత్యవసర సరుకులను సకాలంలో ప్రజలకు అందేలాగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం ఇరువురికి రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్చాలను అందించి ఘన స్వాగతం పలికారు.

## పట్టాదార్ పాస్ పుస్తకాలతో రైతు భూమికి భద్రత ఎమ్మెల్యే .



పిచ్చాటూరు జూన్ 5 మనం న్యూస్ :పట్టాదార్ పాస్ పుస్తకాల తో రైతుల భూములకు భద్రత భరోసా ఏర్పడుతుందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. శుక్రవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు రెప్పాల పట్టు రెవెన్యూ పరిధిలోని రైతులకు ఎమ్మెల్యే చేతులమీదుగా19 పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు లభించడం విశేషం, అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు సర్వేయర్ల ద్వారా రీ సర్వేను పక్కా ప్రణాళికతో నిర్వహిస్తే భూ సమస్యలు పూర్తిగా పరిష్కారం అవుతాయని అలా జరగాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. సర్వే కు వెళ్ళినప్పుడు ప్రతి రైతుకు ముందస్తుగా సమాచారం అందించి రైతు పొలాల వద్దకు వచ్చిన తర్వాతనే సర్వే నిర్వహించాలన్నారు. తప్పుల తడక లేని భూ సర్వే నిర్వహించాలన్నది సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచన అన్నారు. అలాగే ప్రభుత్వ భూములను గుర్తించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి పట్టాలు అందించాలని తాసిల్దార్ను కోరారు. కార్యక్రమంలో తాసిల్దార్. వై. చంద్రబాబునాయుడు, ఎంపీడీవో మహమ్మద్ రఫీ ఏఎంసీ మాజీ చైర్మన్ ఇలంగోవన్ రెడ్డి, నాయకులు పద్దు రాజు, రవి రెడ్డి, సుమాంజలి, రాజేశ్వరి, నాగరాజు, రవి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలి

- మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలి--!
- ఐ సి డి ఎస్ సూపర్వైజర్ మంజుల



పూతలపట్టు /ఐరాల జూన్5 మనం న్యూస్:కి ౕరీ బాలికలు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ఐసిడిఎస్ ఐరాల మండల సూపర్వైజర్ మంజుల పేర్కొన్నారుకిశోరి వికాసం సమ్మర్ క్యాంప్ – 11వ సెషన్ విజయవంతంగా నిర్వహణ జరిగిందన్నారుశుక్రవారం ఐరాల మండ లంలోని సవటపల్లి గ్రామంలో కిశోరి వికాసం సమ్మర్ క్యాంప్లో భాగంగా 11వ సెషన్ను "పొగాకు, మద్యం, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండటం" అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కిశోర బాలికలకు డ్రగ్స్ అంటే ఏమిటి, మత్తు పదార్థాల వాడకం వల్ల శారీరక, మానసిక, సామాజిక పరంగా కలిగే దుష్పరిణామాలు ఏమిటి, వాటికి అలవాటు పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ఎలా అలవరచుకోవాలి అనే అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ మంజుల పాల్గొని బాలికలకు విలువైన సూచనలు అందించారు. అలాగే డీసీపీయూ సిబ్బంది కౌన్సిలర్ ఉషా , సోషల్ వర్కర్ ఎం.బి. ఉమాదేవి వైద్య శాఖకు చెందిన ఎం ఎల్ హెచ్ పి కరిష్మా , ఆశా కార్యకర్తలు తులసి చిట్టెమ్మ అంగన్వాడీ టీచర్లు సుభద్ర కస్తూరి , ధ న లక్ష్మి సావిత్రమ్మ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ యువత మరియు బాలికలు మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా బాలికల్లో మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన పెరిగి, వాటికి దూరంగా ఉండాలనే సంకల్పం ఏర్పడిందని తెలిపారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు

## పర్యావరణ పరిరక్షణ కోసం సైకిల్ సవారి చేసిన టిడిపి శ్రేణులు

- పిచ్చాటూరు జూన్ 5 మనం న్యూస్:

పర్యావరణ పరిరక్షణ కోసం స్థానిక టిడిపి నాయకులు ఆ పార్టీ శ్రేణులతో కలిసి కీలపూడి శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం ముందు నుంచి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినాన్ని పురస్కరించుకొని శుక్రవారం టిడిపి పార్టీ ఆదేశాల మేరకు సైకిల్ సవారి చేస్తున్నామన్నారు. నేటికీ వైసీపీ విధ్వంసపాలనకు చరమగీతం పాడి రెండేళ్లు పూర్తి చేసుకున్న మన్నారు. జగన్నాటకాలు ఆడుతున్న గొడ్డలి పార్టీ గందరగోళాలకు ప్రజా ఆందోళన అతి త్వరలో ఉప్పెనల వస్తుందన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు సతీష్ నాయుడు, పల్లికొండేశ్వరాలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ పద్మనాభ రాజు, మండల పార్టీ అధ్యక్షుడు శివకృష్ణమ నాయుడు, సింగల్ విండో చైర్మన్ జయచంద్ర నాయుడు, నాయకులు తిరుమల రెడ్డి, రవి, రమేష్, చిన్న, త్యాగరాజు, సుబ్రహ్మణ్యం రెడ్డి రామకృష్ణమరాజు తదితరులు పాల్గొన్నారు

## మత్తు పదార్థాలు వద్దు- క్రమశిక్షణే ముద్దు

- పోక్సో చట్టం అవగాహన సదస్సులో సూపర్వైజర్లు



పిచ్చాటూరు జూన్ 5 మనం న్యూస్ : మత్తును అందించే క్రైని, గుట్కా, గంజాయి, బీడీ ,చుట్ట మత్తు పానీయాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యం ఇల్లు గుల్ల అవుతుంది అందువల్ల అవి వద్దు, క్రమ శిక్షణతో చదువుకోవడం నడుచుకోవడమే ముద్దు తద్వారా బంగారు భవిష్యత్తు ఉంటుందని అంగన్వాడీ సూపర్వైజర్లు భజావతి, సుమతీలు తెలిపారు. శుక్రవారం సిడిపిఓ సౌభాగ్యమ్మ ఆదేశాల మేరకు పిచ్చా టూర్ ఇందిరా నగర్ కాలనీలో నీ అంగన్వాడీ పరిధిలో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ లబ్ధిదారు లు కిషోరీ వికాసం, ఐ వి ఆర్ కాల్స్ పై అవగాహన కలిగి ఉండాలన్నారు. లబ్ధిదారులు అందుకుంటున్న పౌష్టికాహారం పై సరియైన సమాధానాన్ని అందించాలని కోరారు. చిన్నారులను కాన్వెంట్లకు పంపించడం ద్వారా డబ్బు సమయం వృధా తప్ప ప్రయోజనం శూన్యం అన్నారు. అదే అన్ని వసతులు ఉన్న అంగన్వాడీ కేంద్రాలకు చిన్నారులను పంపించడం వల్ల అందుబాటులో ఉండడంతోపాటు పౌష్టికాహారం, ఆటపాటలతో కూడుకున్న చదువులు అందుతుందన్నారు. అనంతరం కిషోర్వికాసం ర్యాలీ నిర్వహించారు కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్త ఆముద, బాలింతలు, గర్భవతులు, అంగన్వాడి పిల్లల తల్లిదండ్రులు, కిశోర బాలికలు వారి తల్లిదండ్రులు.



## కేంద్ర మంత్రికి పియూష్ గోయల్‌కు ఘన స్వాగతం

జూన్ 5 మనం తిరుపతి :కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి పియుష్ గొయల్ శుక్రవారం తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి టిటిడి అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున మంత్రికి ఘన స్వాగతం పలికారు. బీజేపీ నేత గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి పియూష్ గోయల్‌కు అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందించి, దుస్సాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ప్రతి పౌరుడు పర్యావరణ పరిరక్షణకు తన వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధిలో పరిశ్రమల రంగం కీలక పాత్ర పోషిస్తోందని, కేంద్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు గుండాల గోపీనాథ్ రెడ్డి, బిజెపి తిరుపతి నార్త్ మండల అధ్యక్షుడు లోక ప్రభాకర్ నాయుడు, బిజెపి తిరుచానూరు నాయకులు విశ్వనాథ్, మనీ, సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం లో మొక్కలు నాటిన ఆలయ చైర్మన్ ఈవో



పూతలపట్టు/ కానిపాకం జూన్5 మనం న్యూస్"ప్రంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ చైర్మన్ మణి నాయుడు ఈవో పెంచల కిషోర్ వినాయక స్వామి దేవస్థానం నందు మొక్కలు నాటారు వినాయక సదన్ వసతి సముదాయము, 100 అడుగుల రోడ్డు నందు దేవస్థానం చైర్మన్ మణి నాయుడు దేవస్థానం ఈ.వో శ్రీ పెంచల కిషోర్ మొక్కలు నాటడం జరిగింది, ఇందులో భాగంగా పర్యావరణాన్ని పరిరక్షించడంలో దేవస్థానం సిబ్బంది అందరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు, ఈ కార్యక్రమంలో ఏ.ఈ లు అరవింద్, శివాంజనేయులు, ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## *పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపును వ్యతిరేకించండి.*

- నిరసన కార్యక్రమంలో
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి




జూన్ 5 మనం తిరుపతి:కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంపుకు వ్యతిరేకంగా శుక్రవారం స్విమ్స్ ఆస్పత్రి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమం ఉద్దేశించి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి , సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు మాట్లాడుతూ ఇరాన్ యుద్ధ ప్రభావం కారణంగా పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు పెంచామని కేంద్ర ప్రభుత్వం చెప్పడాన్ని ఒక మోసపూరిత చర్య అని పేర్కొన్నారు. ఇరాన్ యుద్ధం ప్రారంభం కాకముందు కూడా ఎన్డీఏ పాలనలో దాదాపు 12సార్లు పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి ప్రజల నడ్డి విరిచారని విమర్శించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల అనంతరం నాలుగు సార్లు పెట్రోలు, డీజిల్ , గ్యాస్ ధరలు పెంచి ప్రజలపై తీవ్రమైన భారాలు వేయడాన్ని తప్పు పట్టారు. ఇప్పటికే పెరిగినటువంటి ధరలతో ప్రజలు అల్లాడిపోతున్నారని, ప్రజల కొనుగోలు శక్తి రోజు రోజుకు దిగజారి పోతుందని, ఇటువంటి పరిస్థితులలో ప్రజలు బతకడమే కష్టంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ ల ప్రయోజనాల కోసం ధరలు పెంచుతున్నారని అన్నారు. రాష్ట్రంలో కూటమి నేతలు కూడా ధరల పెరుగుదలపై నోరు మెదపడం లేదని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులకు గత 12 సంవత్సరాల నుండి జీతాలు పెంచకపోవడం వల్ల కుటుంబాలు జీవనం సాగించడం కష్టతరమవుతుందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులందరికీ వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెంచిన పెట్రోలు, డీజిల్ ,గ్యాస్ ధరలు తగ్గించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు . ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి సుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర, పి మునిరాజా, కే వేణుగోపాల్, పి బుజ్జి, వాసు, పార్థసారధి రెడ్డి, రవి, ఆటో డ్రైవర్లు, తోపుడు బండ్లు వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## వెన్నుపోటుకు రెండేళ్లు.. మంటల్లో టిడిపి మేనిఫెస్టో..! వైస్సార్సీపి




చిన్నగొట్టిగల్లు (ఎర్రవారిపాలెం) జూన్ 5మనం న్యూస్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రెండేళ్లుగా మోసం చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ నేతలు నిరసలను వ్యక్తం చేశారు.. శుక్రవారం చంద్రగిరి నియోజకవర్గం సమన్వయ కర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, రాష్ట్ర వైస్సార్సీపీ విద్యార్ధి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ల సూచనలు మేరకు చిన్నగొట్టిగల్లు, ఎర్రవారిపాలెం మండలాల్లో వైస్సార్సీపీ నేతలు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. సూపర్ సిక్స్ హామీలకు సంబంధించిన ప్లకార్డులు, మేనిఫెస్టో పుస్తకాలను దహనం చేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు.ఎన్నికల సమయంలో అమలు చేయలేని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించారన్నారు సూపర్ సిక్స్.. అట్టర్ ఫ్లాప్'', ''అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం డౌన్ డౌన్'' అంటూ నినాదాలు చేశారు.

# అమర రాజా ఎనర్జీ,మొబిలిటీ లిమిటెడ్‌లో ఘనంగా ప్రపంచ పర్యావరణ




తిరుపతి జూన్ 5 మనం న్యూస్: అమర రాజా ఎనర్జీ,మొబిలిటీ లిమిటెడ్ తన అన్ని ప్రదేశాల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం–2026ను ఘనంగా నిర్వహించింది. సుస్థిరత, వాతావరణ చర్యలు, సహజ వనరుల సంరక్షణ పర్యావరణ పరిరక్షణ పట్ల సంస్థకు ఉన్న అచంచలమైన కట్టుబాటును ఈ సందర్భంగా మరొక్కసారి చాటిచెప్పింది.ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవం "నౌ ఫర్ క్లైమేట్ – ప్రకృతి నుండి ప్రేరణ… వాతావరణం కోసం… మన భవిష్యత్తు కోసం అనే ప్రపంచ థీమ్‌తో నిర్వహించబడింది. ఈ థీమ్ ప్రకృతి ఆధారిత పరిష్కారాల ద్వారా వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొనేందుకు సమిష్టి చర్యల అవసరాన్ని నొక్కిచెప్పింది.అమర రాజా ఎనర్జీ, మొబిలిటీ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నారాయణ్ చౌదరి మార్గదర్శకత్వం లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇండస్ట్రియల్ బిజినెస్ యూనిట్ ఆపరేషన్స్ హెడ్ ఎం. శ్రీనివాసరావు, ఆటోమోటివ్ బిజినెస్ యూనిట్ ఆపరేషన్స్ హెడ్ బి. మునీశ్వర నాయుడు పాల్గొన్నారు.ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి తిరుపతి జోనల్ కార్యాలయానికి చెందిన సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ బి.వై. మునిప్రసాద్, సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ చి. రాజశేఖర్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మనోహర్ చీలి హాజరై సభను ఉద్దేశించి ప్రసంగించారు.పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం నియంత్రణ పరమైన బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి వ్యక్తి, ప్రతి సంస్థ యొక్క సమిష్టి బాధ్యత అని వారు పేర్కొన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో పరిశ్రమల పాత్ర అత్యంత కీలకమని వారు అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా హెల్త్, సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ విభాగాధిపతి డా. సదాశివన్ సురేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న వాతావరణ మార్పుల ప్రభావాలను ప్రస్తావించారు. పారిశ్రామిక యుగానికి ముందు ఉన్న స్థాయిలతో పోలిస్తే భూమి ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్ లోపు పరిమితం చేయడం అత్యంత అవసరమని తెలిపారు. సహజ వనరుల సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ, పర్యావరణ ప్రభావాల తగ్గింపు భావితరాల భద్రత కోసం తక్షణ చర్యలు అవసరమని ఆయన వివరించారు.కార్యక్రమంలో భాగంగా అమర రాజా చేపడుతున్న పలు సుస్థిరత కార్యక్రమాలను ప్రదర్శించారు. పునరుత్పాదక ఇంధన వినియోగం, ఇంధన సామర్థ్య మెరుగుదల, నీటి సంరక్షణ, మురుగు నీటి శుద్ధిపునర్వినియోగం, వ్యర్థాల తగ్గింపు, పునర్వినియోగ ప్రక్రియలు, హరిత వలయాల అభివృద్ధి, కాలుష్య నివారణతో పాటు కార్బన్ ఉద్గారాల తగ్గింపునకు చేపడుతున్న చర్యలను వివరించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా తిరుపతి జిల్లా కరకంబాడి,చిత్తూరు జిల్లా నూనెగుండ్లపల్లి ప్రాంతాల్లోని సంస్థ ప్రాంగణాల్లో విభాగాధిపతులు, ఉద్యోగులు కలిసి 450కు పైగా మొక్కలను నాటారు. ఈ మొక్కల నాటే కార్యక్రమం హరితావరణ విస్తరణ, పర్యావరణ సమతుల్యత పరిరక్షణ సుస్థిర భవిష్యత్తు నిర్మాణానికి సంస్థ చేస్తున్న కృషికి నిదర్శనంగా నిలిచింది.ఈ వేడుకల ద్వారా అమర రాజా ఎనర్జీ, మొబిలిటీ లిమిటెడ్ తన వ్యాపార కార్యకలాపాల్లో పర్యావరణ బాధ్యతను మరింత బలోపేతం చేస్తూ, వాతావరణానికి అనుకూలమైన,సుస్థిర భవిష్యత్తు నిర్మాణానికి తన నిబద్ధతను మరోసారి పునరుద్ఘాటించింది.

# మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ ఎంతో కీలకం

● పర్యావరణ పరిరక్షణలో యువత భాగస్వామ్యం అవసరం:జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్




తిరుపతి, జూన్ 05, మనం న్యూస్: మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ ఎంతో కీలకమని, పర్యావరణ పరిరక్షణలో యువత భాగస్వామ్యం అవసరమని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రేణిగుంట (తూకివాకం) సమీపంలో తుడా ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, జే సి ఆర్. గోవింద రావు, తుడా ఛైర్మన్ సి. దివాకర్ రెడ్డి కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడానికి ప్రభుత్వం వినూత్నమైన కార్యక్రమాలను చేపడుతోందన్నారు. చెట్లు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణ, నీరు పోయడం, ఎరువులు, క్రిమి సంహరక మందులు వేయడం వంటి చర్యలు తీసుకోకపోతే మొక్కలు జీవించవన్నారు. చెట్ల సంరక్షణలో ప్రజలందరూ తమ వంతు భాగస్వామ్యం అందించాలని సూచించారు. ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావం కారణంగా ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగాయని, సాధారణంగా ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 14.4 డిగ్రీలుగా ఉండగా, ప్రస్తుతం 15 డిగ్రీలు దాటితే తీరప్రాంతాల్లో నివసించే మూడో వంతు జనాభా తీవ్ర ప్రభావానికి గురవుతుందన్నారు. ఈ కారణంగా చేపల వేట ఇబ్బందికరంగా మారి తీరప్రాంత జీవనోపాధులు దెబ్బతింటాయన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున సీడ్ పెల్లెట్స్ కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రారంభించారన్నారు. విత్తనాలను సహజ పదార్థాలతో (ఆవుపేడ, ఇతర జీవామృతాలు) కలిపి చిన్న గుళికల రూపంలో తయారు చేసి నాటడం ద్వారా వర్షాభావం ఉన్నా, నీరు తక్కువ ఉన్నా మొక్కలు ఎక్కువ కాలం జీవిస్తాయని, ఈ విధానం ద్వారా మొక్కల జీవన శాతం పెరుగుతుందన్నారు. తిరుపతి, శేషాచలం కొండల్లో ఉన్న చెట్ల కారణంగా అక్కడ ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా చెట్లు నాటడం ద్వారా వాతావరణాన్ని నియంత్రించవచ్చన్నారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, ప్రజలందరూ కలిసి ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని గౌరవ ఉప ముఖ్యమంత్రి గారు పిలుపునిచ్చారన్నారు. విద్యార్థులను ఉద్దేశించి పర్యావరణ పరిరక్షణలో వారి పాత్రను వివరించారు. పిల్లలు చిన్న వయసులోనే చెట్లను నాటడం, వాటిని సంరక్షించడం అలవాటు చేసుకోవాలని, తద్వారా భవిష్యత్తులో పచ్చదనాన్ని పెంపొందించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం సూచనల మేరకు జూన్ 5న జిల్లాలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. చెట్లు నాటడం మాత్రమే కాకుండా వాటిని పెంచడం, సంరక్షించడం కూడా అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతి మనిషి ఏ రంగంలో స్థిర పడినా పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇంటి వద్ద, పాఠశాలల్లో, పొలాల్లో, ఖాళీ ప్రదేశాల్లో చెట్లు నాటడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని సూచించారు. చెట్లు నరికే పరిస్థితి వచ్చినప్పుడు, దానికి బదులుగా కొత్త చెట్లు నాటడం ద్వారా ప్రకృతిలో సమతుల్యతను నిలుపుకోగలమన్నారు. తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ చెట్లు నాటడంతో పాటు వాటి సంరక్షించడం కూడా అత్యంత ప్రధానం అని ఈ కార్యక్రమంలో యువత భాగస్వామ్యం కావాలన్నారు. ఇంటి వద్ద, పాఠశాలల్లో, పొలాల్లో, ఖాళీ ప్రదేశాల్లో చెట్లు నాటడం ద్వారా కాలుష్యాన్ని నివారించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని సూచించారు. చిన్నతనం నుండే మొక్కలు నాటడం ప్రారంభిస్తే, భవిష్యత్తులో అదొక గొప్ప అలవాటుగా మారుతుందన్నారు. ప్రస్తుతం ఇందన కొరత ఉన్న తరుణంలో సౌర శక్తి వినియోగం, బ్యాటరీ వాహనాల వినియోగం ద్వారా కాలుష్య నివారణ సాధ్యమవుతుందన్నారు. కర్ణాటక రాష్ట్రం గ్రీన్ సిటీగా అభివృద్ధి చెందిందని, అదే విధంగా ఆంధ్ర రాష్ట్రం కూడా గ్రీన్ సిటీగా మారే విధంగా ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. దేశ పరిరక్షణలో సైనికులు శ్రమిస్తున్న తీరులోనే యువత కూడా తమ పరిసర ప్రాంతాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ కు నడుం బిగించాలన్నారు…….



## కాణిపాకంలో లడ్డు నాణ్యతను పరిశీలించిన చైర్మన్ ఈఓ

పూతలపట్టు కానిపాకం జూన్ 5 మనం న్యూస్: స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం నందు లడ్డు పోటులోలడ్డు నాణ్యత ను కాణిపాకం ఆలయం చైర్మన్ మణి నాయుడు కార్యనిర్వహణ అధికారిపెంచల కిషోర్ శుక్రవారం పరిశీలించారువినాయకస్వామివారి దేవస్థానం లడ్డు పోటు నాణ్యత పరిశీలించిన దేవస్థానం చైర్మన్ మణి నాయుడు ఈ.వో శ్రీ పెంచల కిషోర్ భక్తులకు నాణ్యమైన, రుచికరమైన, లడ్డు ప్రసాదాన్ని అందజేయాలని సిబ్బందికి కాంట్రాక్టర్ కి సూచించారు, నాణ్యత లోపిస్తే చర్యలు చేపడతామని తెలియజేశారు,

## సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ



పాకాల, జూన్ 5,మనం న్యూస్ :2026-27 విద్యా సంవత్సరానికి చెందిన** సర్వే పల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర ** స్టూడెంట్స్ కిట్స్ లో భాగంగా టెక్స్ట్ బుక్స్,వర్క్ బుక్స్,నోట్ బుక్స్ ,యూనిఫామ్స్ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందచేయడం జరిగిందని పాకాల మండల విద్యా శాఖాధికారులు లింగయ్య,బాబ్జి అన్నారు. వారు మాట్లాడుతూ శుక్రవారం పాకాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి ఆయా పాఠశాలలకు ఈ కిట్స్ అందచేస్తున్నామని పేర్కొన్నారు. ఇంకా బ్యాగ్స్, షూస్, నిఘంటువులు రావలసి ఉందని అవి కూడా వచ్చిన వెంటనే సరఫరా చేయడం జరుగుతుందని అన్నారు. ఇచ్చిన వాటిని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జూన్ 12 వ తేదీ పాఠశాలలు పునఃప్రారంభం రోజు విద్యార్థులకు అందచేయాలని కోరారు.ఈ విద్యా సంవత్సరంలో 6,7 మరియు 8 తరగతుల వారికి సిలబస్ లో మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు.మార్పును గమనించి ఉపాధ్యాయులు బోధించగలరని పేర్కొన్నారు.ఈ కిట్స్ ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సి.ఆర్. పి.లు.శ్రీనివాసులు,ప్రకాష్ రెడ్డి,ముని కృష్ణ,జ్యోతి, శివకుమారి,ఆఫీస్ సిబ్బంది బిందు భార్గవి,పవిత్ర పాల్గొన్నారు.

## ధాత్రి ఫౌండేషన్ ను సందర్శించిన డాక్టర్ మురుగన్

● స్వాగతం పలికిన ధాత్రి ఫౌండేషన్ చైర్మన్ స్వాతి చక్రపాణి



మదనపల్లె, జూన్ 05,మనం న్యూస్: చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం పలమనేరు మండలం గంటాపూర్ బీసీ కాలనీ శ్రీ శ్రీ తిరుపతి గంగమ్మ గుడి చైర్మన్ సేవారత్న డాక్టర్ మురుగన్ నేడు మదనపల్లి ధాత్రి ఫౌండేషన్ చైర్మన్ స్వాతి చక్రపాణి ఆహ్వానం మేరకు వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా దాత్రి ఫౌండేషన్ చైర్మన్ స్వాతి చక్రపాణి స్వాగతం పలికారు. ఆనంద నిలయం వృద్ధాశ్రమంలో ఉన్నటువంటి అవ్వ తాతలు మురుగన్ ను ఆప్యాయంగా పలకరించారు..ఈ సందర్భంగా దాత్రి ఫౌండేషన్ చైర్మన్ స్వాతి చక్రపాణి మాట్లాడుతూ, సామాజిక సేవ మరియు భక్తి మార్గంలో పయనిస్తున్న సేవా రత్న డాక్టర్ మురుగన్ ను కలవడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు.. ఒక సేవా కార్యక్రమంలో కలిసినప్పుడు ఫౌండేషన్ను ఒకసారి విజిట్ చేయమని కోరిన వెంటనే ఆయన రావడం మాకు ఎంతో సంతోషంగా ఉందని ఆమె తెలిపారు .డాక్టర్ మురుగన్ మాట్లాడుతూ, దాత్రి ఫౌండేషన్ వారి ఆహ్వానం మేరకు ఇక్కడికి రావడం జరిగిందని, ఈ ఆనంద నిలయంలకు రావడంతో ఇక్కడున్న అవ్వ తాతలను చూస్తే నాకు మా అవ్వ తాతలు గుర్తుకొచ్చారని తెలిపారు..ఎంతోమంది వృద్ధులు తమ కుటుంబీకుల ప్రేమానురాగలు పొందలేక వీధిన పడుతున్నారని,అలాంటివారిని అక్కున చేర్చుకుని వారికి తన కుటుంబ సభ్యుల మాదిరిగా మూడు పూటలా ఆహారం అందించి వారి బాగోగులు చూస్తున్నటువంటి దాత్రి ఫౌండేషన్ చైర్మన్ స్వాతి చక్రపాణిని అభినందించారు. ఆనంద నిలయం లోని వృద్ధులకు, ఆమె చేస్తున్న సేవ ఎంత చెప్పినా తక్కువే, ఇటువంటి మంచి కార్యక్రమంలో నేను కూడా ఒక భాగం అవ్వడం చాలా సంతోషంగా ఉందని అయన అన్నారు..ధాత్రి ఫౌండేషన్ కు నా వంతు సైతం సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ మురుగ్ ను అవ్వ తాతలు ఆప్యాయంగా పలకరించారు..

## శివయోగి శంకర స్వామి పాలరాతి విగ్రహంఆవిష్కరణ



పూతలపట్టు జూన్ 5 మనం న్యూస్:పూతలపట్టు భీమేశ్వర ఆలయ పక్కన శుక్రవారం , భీమేశ్వరాలయం పక్కన శివసేవా మండలి ఆధ్వర్యంలో శివయోగి శంకరస్వామి పాలరాతి విగ్రహాన్ని ఆవిష్కరించారు గత కొన్ని సంవత్సరాలుగా గురుకుల్ గా ఉన్న శంకర్ స్వామి 4వ గురుపూజా మహోత్సవం పాలరాతి విగ్రహ ఆవిష్కరణ జరిగింది శంకర్ స్వామి పాలరత విగ్రహానికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు అర్చకులు శరవణ చేశారు కార్యక్రమం ఘనంగా జరగగా, ఈ కార్యక్రమంకు హాజరై, ఆవిష్కరణ గావించి, స్వామివారి ఆశీస్సులు పొంది , అందరూ బాగుండాలని ప్రార్థించిన పూతలపట్టు సుబ్బారెడ్డి సతీమణి, వైయస్సార్సీపి నాయకురాలు పూతలపట్టు గౌహతి సుబ్బారెడ్డి పూతలపట్టు పి .ఎస్ .ఆర్ ) అభిమానులు. పాల్గొన్నారు



## చేనేత కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి.

● కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్.

నారాయణవణం జూన్5 మనం న్యూస్:చేనేత కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ డిమాండ్ చేశారు. శుక్రవారం నారాయణ వనం గ్రామ పంచాయతీ, పద్మశాలి కాలనీలో ఆయన పర్యటించారు. చేనేత కుటుంబాల ఆర్థిక స్థితిగతులను, వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా చింతామోహన్ మీడియాతో మాట్లాడారు. చేనేత కార్మికుల ఆర్థిక పరిస్థితులు చాలా అధ్వానంగా ఉందన్నారు. పాలక్ ప్రభుత్వాలు ఆదుకోకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. దినానికి రూ. 300 రూపాయలు సంపాదించుకోలేని దుస్థితిలో ఉన్నారన్నారు. పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో చేనేత కార్మికులు తయారు చేసిన చీరలు, ఇతర వస్త్రాలను బయటి దేశాలకు ఎగుమతి చేసే వాళ్ళమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తద్వారా చేనేత రంగానికి, కార్మికులకు ఆర్థిక స్థోమత వచ్చిందన్నారు. బిజెపి పాలనలో చేనేత రంగం హీనస్థితికి దిగజారిందని విమర్శించారు. ఒక నెల రోజులు లోపు నారాయణవనం, వెంకటగిరి, వరదయ్యపాలెం ప్రాంతాల్లో ఉన్న చేనేత కుటుంబాలు తయారుచేసిన వస్త్రాలను బయట దేశాలకు ఎగుమతి అయ్యేలా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత పరిశ్రమను పట్టించుకోవడం లేదన్నారు. ఎటువంటి సదుపాయాలు కల్పించడం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి చేనేత రంగానికి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేలా గట్టి ప్రయత్నాలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మునివాసులు, బాబు, వెంకటేష్, చెంగల్ రాయులు, వెంకటముని, మాలతి, పుష్పా, కైలాసం తదితరులు పాల్గొన్నారు.



## ఎంఎస్ఎంఈ పథకాలతో యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

● ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలి
● శ్రీ అక్షర బిగ్ ప్రింట్స్‌ను
● సందర్శించిన జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి , జూన్ 5 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ఎంఎస్ఎంఈ పథకాలను యువత సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి రంగంలో ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. తిరుపతి నగరంలోని అన్నమయ్య సర్కిల్ వద్ద "వన్ ఫ్యామిలీ – వన్ ఎంటర్‌ప్రెన్యూర్" కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన శ్రీ అక్షర బిగ్ ప్రింట్స్‌ను శుక్రవారం ఉదయం కలెక్టర్ సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ప్రభుత్వ పథకాల సహకారంతో స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఎంఎస్ఎంఈ రంగం ద్వారా ఉపాధి పొందడమే కాకుండా ఇతరులకు కూడా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగవచ్చున్నారు. శ్రీ అక్షర బిగ్ ప్రింట్స్‌లో జపాన్ సాంకేతికతతో కూడిన ఆధునిక పరికరాలు, అంతర్జాతీయ ప్రమాణాల రంగులను ఉపయోగించి నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తున్నారని కలెక్టర్ అభినందించారు. ఇటువంటి పరిశ్రమలు యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

బిగ్ ప్రింట్స్ సంస్థ అధినేత, హరిబాబు మద్దినేని మాట్లాడుతూ, "వన్ ఫ్యామిలీ – వన్ ఎంటర్‌ప్రెన్యూర్" కార్యక్రమంలో భాగంగానే శ్రీ అక్షర బిగ్ ప్రింట్స్‌ను స్థాపించినట్లు ఈ సంస్థ నుండి అన్ని రకాల ప్రింటింగ్ ఉత్పత్తులు అందిస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ సంస్థను సందర్శించడం ఆనందంగా ఉందని, ఈ సంస్థ ద్వారా తనతో పాటు మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పించగలగడం సంతోషకరమని పేర్కొన్నారు.



## రేణిగుంట మండలలో ఒడ్డిమిట్ట, వేణుగోపాలపురాల్లో టైఫాయిడ్‌పై అవగాహన

రేణిగుంటమనం జూన్ 5L మండల వైద్యాధికారి డాక్టర్ తేజస్విని ఆదేశాల మేరకు ఒడ్డిమిట్ట, వేణుగోపాలపురం గ్రామాల్లో హెల్త్ సూపర్వైజర్ కామరాజు, హెచ్ఈఓ బాబు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ టైఫాయిడ్‌పై అవగాహన కల్పించారు. ఇటీవల ఊరి గంగమ్మ జాతర జరిగిన నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా ఈ కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కలుషిత నీరు, కలుషిత ఐస్, బహిరంగ మలమూత్ర విసర్జన మరియు మూతలు లేని రోడ్డు పక్కన ఆహారాల వల్ల టైఫాయిడ్ వ్యాప్తి చెందుతుందన్నారు. తీవ్ర జ్వరం, తలనొప్పి, అలసట, కడుపునొప్పి ఈ వ్యాధి లక్షణాలన్నారు. ప్రజలు నీటిని కాచి చల్లార్చి తాగాలని, చేతులను సబ్బుతో కడుక్కోవాలని, తాజాగా వండిన ఆహారమే తినాలని సూచించారు.